క్లుప్తంగా

జెడ్పీ సీఈఓ సమీక్ష

నెల్లూరు (పొగతోట) : రికార్డుల నిర్వహణ, ఆడిట్ వివరాలు, ప్రజా విజ్ఞప్తుల పరిష్కారం తదితర అంశాలపై జెడ్పీ సీఈఓ విద్యారమ స్థానిక జెడ్పీ కార్యాలయంలో శనివారం వివిధ మండలాల సూపరింటెండెంట్‌లతో సమీక్షించారు. రికార్డుల నిర్వహణలో లోపాలు లేకుండా ప్రజా విజ్ఞప్తులను సకాలంలో పరిష్కరించాలని సూచించారు.

ఏడు కేంద్రాల్లో గ్రూపు-2 పరీక్షలు

నెల్లూరు (అర్బన్): జిల్లాలో ఆదివారం గ్రూపు-2 పరీక్షలను ఏడు కేంద్రాల్లో నిర్వహించనున్నారు. నగరంలోని వైఎంసీఏ గ్రౌండ్‌లో ఉన్న వీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీజీ స్టడీస్ సెంటర్, నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, ధనలక్ష్మీపురంలోని శ్రీచైతన్య జూనియర్ కళాశాల, నారాయణ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్, రామలింగాపురంలోని జగన్స్ డిగ్రీ కళాశాల, గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, వెంకటాచలంలోని క్యాబా ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్షలు జరుగుతాయి. మొత్తం 4,102 మంది అభ్యర్థులు పరీక్ష రాయాల్సి ఉంది. పేపర్-1 ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, పేపర్-2 మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30 వరకు జరుగుతాయి.

విద్యుత్ స్తంభాల ఏర్పాటు



సాక్షి ఎఫెక్ట్..

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీలో కొత్త విద్యుత్ స్తంభాల ఏర్పాటు, లైన్లు వేయకపోవడంపై సాక్షి దినపత్రికలో శుక్రవారం 'కరెంట్ కష్టాలకు చెక్ పడేనా?' అనే శీర్షికన ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. ఈ మేరకు శనివారం కాలనీలో పాత విద్యుత్ స్తంభాలను తొలగించి కొత్త వాటిని ఏర్పాటు చేశారు.

డాక్టర్ బిందు మీనన్‌కు అవార్డు



అవార్డు అందుకుంటున్న బిందు మీనన్

నెల్లూరు(అర్బన్) : నగరంలోని అపోలో స్పెషాలిటీ న్యూరాలజీ విభాగాధిపతి డాక్టర్ బిందు మీనన్ మరో ప్రతిష్టాత్మక అవార్డు అందుకున్నారు. అందుకు సంబంధించిన వివరాలు ఆమె శనివారం వెల్లడించారు. ఢిల్లీలో జరిగిన అంతర్జాతీయ సదస్సులో ఏషియా, ఓషియానియన్ అవుట్ స్టాండింగ్ అచీవ్‌మెంట్ ఎపిలెప్సీ అవార్డును అందుకున్నట్లు తెలిపారు.

రాజకీయాలు శ్రీధర్‌రెడ్డి వద్దే నేర్చుకోవాలి

నెల్లూరు సిటీ : రాజకీయాలను కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వద్దే నేర్చుకోవాలని నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. గడప గడపకు కోటంరెడ్డి ముగింపు కార్యక్రమాన్ని మండలంలోని పొట్టేపాళెం గ్రామంలో శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి హాజరై, మాట్లాడారు. రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి గత 40 రోజులుగా గడప గడపకు కార్యక్రమంలో 70 వేల మందిని కలవడం గొప్ప విషయమన్నారు. అనంతరం శ్రీధర్‌రెడ్డి మాట్లాడుతూ నెల్లూరుకు శాశ్వత ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఉండాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుర మందిరంలో సాహితీసభ



తెనాలి రామలింగకవి చిత్రపటానికి నివాళి

నెల్లూరు(బృందావనం) : పురమందిరం ప్రాంగణంలోని వర్ధమాన సమాజం హాల్లో చేతన సంగీత, సాహిత్య, సాంస్కృతిక వేదిక ఆధ్వర్యంలో 'తెనాలి రామలింగ కవి వ్యక్తిత్వం... వికాసం' అనే అంశంపై శనివారం రాత్రి సాహితీ సభను నిర్వహించారు. తొలుత తెనాలి రామలింగకవి చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. ఈ సందర్భంగా బాలసాహితీ భూషణ్ డాక్టర్ గంగిశెట్టి శివకుమార్ మాట్లాడుతూ అద్భుతమైన పాండిత్య ప్రతిభ కలిగిన తెనాలి రామలింగకవి దేశం గర్వించదగిన పండితుడని తెలిపారు. ఆయన కథలు దేశవ్యాప్తంగా ప్రచారంలో ఉన్నాయన్నారు. అనంతరం శివకుమార్‌ను సత్కరించారు. కార్యక్రమంలో పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, చెలంచర్ల భాస్కరరెడ్డి, నలుబోలు బలరామయ్యనాయుడు, ఎ.జయప్రకాష్, గోవిందరాజు సుభద్రాదేవి తదితరులు పాల్గొన్నారు. సంస్థ నిర్వాహకులు వై.శేషగిరీశం, డాక్టర్ ఎం.సుబ్రహ్మణ్యం పర్యవేక్షించారు.

శోభాయమానంగా శైవక్షేత్రాలు



ప్రత్యేకాలంకరణలో మూలస్థానేశ్వరస్వామి ఆలయం





విద్యుద్దీపకాంతుల్లో..

- మహాశివరాత్రికి ముస్తాబైన శివయ్య కొలువులు

నెల్లూరు(బృందావనం) : మహాశివరాత్రి రాక సందర్భంగా నగరంలోని శివాలయాలు అంగరంగ వైభవంగా ముస్తాబవుతున్నాయి. ఓం నమఃశివాయ పంచాక్షరి నామస్మరణతో శైవక్షేత్రాలు హోరెత్తనున్నాయి. ఈనెల 26వ తేదీన మహాశివరాత్రి సందర్భంగా పార్వతీ పరమేశ్వరులకు శాస్త్రోక్తంగా మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకాలు, లింగోద్భవ అభిషేకాలు, విశేష పూజలు, అర్చనలు భక్తిప్రపత్తులతో నిర్వహించనున్నారు. ఆదిదంపతుల కొలువులు విద్యుద్దీప కాంతుల్లో శోభిల్లుతున్నాయి.

మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరాలయం, అన్నపూర్ణ సమేత నీలకంఠేశ్వర స్వామి ఆలయం, మూలాపేట సీఏఎం హైస్కూల్ రోడ్డులోని ఉమామహేశ్వర ఆలయంతో పాటు నగరంలోని వివిధ ప్రాంతాల్లో ఉన్న ముక్కంటి నిలయాలు మహాశివరాత్రి శోభను సంతరించుకున్నాయి. వేకువజాము నుంచే స్వామివారిని దర్శించుకునేందుకు రానున్న భక్తుల కోసం ఆయా ఆలయాల నిర్వాహకులు తగిన ఏర్పాట్లు చేశారు.





ఆలయం లోపల చేసిన ప్రత్యేక ఏర్పాట్లు

శాస్త్రోక్తంగా ధ్వజారోహణ



ధ్వజారోహణను జరిపిస్తున్న అర్చకులు



సింహ వాహనంపై మూలస్థానేశ్వరస్వామి

- ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : మూలాపేటలోని భువనేశ్వరి సమేత మూలస్థానేశ్వరస్వామి దేవస్థానంలో మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు శనివారం వైభవంగా ప్రారంభమయ్యాయి. ఉదయం ధ్వజారోహణను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం స్వామివారి నగరోత్సవం పురవీధుల్లో కనుల పండువగా సాగింది. రాత్రి స్వామివారు సింహవాహనంపై భక్తులను అనుగ్రహించారు. ఉభయకర్తలుగా మాడిశెట్టి కోటయ్య, సుబ్బరత్నమ్మల జ్ఞాపకార్థం కుమారులు వరదరాజులు, శివకుమార్, శ్రీనివాసులు, మనుమడు కోటిగౌతమ్‌లు వ్యవహరించారు. ఈఓ అర్వభూమి వెంకటశ్రీనివాసులు రెడ్డి పర్యవేక్షించారు.

ఉత్తమ ర్యాంకుకై కృషి చేయండి

- కమిషనర్ సూర్యతేజ

నెల్లూరు (బారకాసు) : స్వచ్ఛ సర్వేక్షణ్ కార్యక్రమంలో ఉత్తమ ర్యాంకు సాధించేందుకు ప్రతిఒక్కరు కృషి చేయాలని కమిషనర్ సూర్యతేజ పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఒక ప్రకటన విడుదల చేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ అభిప్రాయ సేకరణ కోసం నగరంలో ఓట్ ఫర్ వెబ్, ఓట్ ఫర్ క్యూఆర్ కోడ్ పోస్టర్లను ప్రచారం చేయాలన్నారు. నెల్లూరు నగర ర్యాంకింగ్‌ను మెరుగుపరచడానికి అవసరమైన లక్ష్యాలను సాధించడంలో అధికారులందరూ సమన్వయంతో సహకరించాలని సూచించారు. 15 రోజుల్లో మొత్తం 10 లక్షల ప్రతి స్పందనలను సాధించాలని, అత్యున్నత స్థాయి నిబద్ధత, సమర్థతతో స్వచ్ఛ సర్వేక్షణ్ ర్యాంకింగ్ కార్యక్రమాన్ని కొనసాగించాలని సూచించారు. ఈ సూచనలు తప్పక పాటించాలని ఆదేశించారు. కార్యాచరణ వివరాలను ఎప్పటికప్పుడు ఉన్నతాధికారులకు నివేదించాలని సూచించారు. ఏవైనా సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొచ్చి పరిష్కారం పొందాలని సూచించారు.

ఎమ్మెల్సీ పరామర్శ



చిన్నా మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్సీ

నెల్లూరు(బారకాసు) : నగరంలోని ఏడో డివిజన్ కాలనీ సెంటర్‌కు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు వంగళ్ల ఆనంద్(సన్ని) తండ్రి చిన్నా మృతి చెందారు. శనివారం ఆయన మృతదేహాన్ని సిటీ ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి సందర్శించి నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.



సర్వే సంకటం

- విధుల్లో నిర్లక్ష్యం వహించిన వారికి షోకాజ్ నోటీసులు

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ వార్డు కార్యదర్శులకు సర్వే సంకటం పట్టుకుంది. అసలు విధులతో పాటు సర్వే విధులు కూడా తోడు కావడంతో అలక్ష్యం వహిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా 142 సచివాలయ పరిధిలోని వార్డు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులను అధికారులు జారీ చేశారు. దీనికి సంబంధించి వివరాలిలా ఉన్నాయి. ప్రభుత్వం సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల (ఎంఎస్ఎంఈ) సర్వే చేపట్టింది. దీని ద్వారా స్థానికంగా ఎన్ని ఉన్నాయి.. వీటి ద్వారా ఎంత మంది ఉపాధి పొందుతున్నారు.. తదితర వివరాలు సేకరించాల్సి ఉంది. సర్వేలో ఆయా పరిశ్రమల యజమానులు మరింత అభివృద్ధి చెంది ఎక్కువ మందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా ప్రభుత్వం అవసరమైన చర్యలు చేపట్టనుంది. ఇందుకోసం ప్రభుత్వ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయ వార్డు కార్యదర్శులు సర్వే చేపట్టాలని కమిషనర్ సూర్యతేజ ఆదేశాలు జారీ చేశారు. కాగా ఎన్ఎంసీ పరిధిలో మొత్తం 166 సచివాలయాలున్నాయి. ఒక్కో సచివాలయంలో తొమ్మిది మంది కార్యదర్శులు పలు విభాగాలకు సంబంధించి విధులు నిర్వర్తిస్తుంటారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ సర్వే కూడా వార్డు కార్యదర్శులకు అప్పజెప్పారు. ఓ వైపు ప్రభుత్వ ఉన్నతాధికారుల నుంచి ఒత్తిడితో కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి ఎంఎస్ఎంఈ సర్వేను త్వరితగతిన పూర్తి చేయాలని పదేపదే వార్డు కార్యదర్శులను ఆదేశిస్తున్నప్పటికీ వారిలో నెలకొన్న నిర్లిప్తధోరణి వల్ల వేగంగా పూర్తి చేయలేకపోతున్నారు. దీనిపై కమిషనర్ పూర్తిస్థాయిలో పరిశీలించగా సదరు కార్యదర్శులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నట్లు గుర్తించి షోకాజ్ నోటీసులు జారీ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. దీంతో 142 సచివాలయాల్లో నిర్లక్ష్యంగా సర్వే చేస్తున్న వార్డు కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేశారు. వీరు 24 గంటల్లోగా సంజాయిషీని అదనపు కమిషనర్‌కు సమర్పించాలని, లేనిపక్షంలో సీసీఏ నిబంధనల మేరకు తదుపరి చర్యలు తీసుకుంటామని నోటీసులో పేర్కొన్నారు.

ప్రతి గింజను కొనుగోలు చేస్తాం



అధికారులతో సమీక్షిస్తున్న మంత్రి మనోహర్

నెల్లూరు (పొగతోట) : రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ అన్నారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో కలిసి ఆయన ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో శనివారం సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మాట్లాడుతూ అధికారులందరూ రాబోయే రెండు నెలలు కష్టపడి రైతాంగానికి మేలు చేసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. రైతులకు సంబంధించి ఈకేవైసీ వెంటనే పూర్తి చేయించాలన్నారు. ధాన్యం విక్రయించిన రైతులకు 24 గంటల్లోనే నగదు జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి జిల్లా వ్యాప్తంగా 300 ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తామని తెలిపారు. రైతులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. బ్యాంకు గ్యారెంటీ ఇచ్చిన రైస్ మిల్లులకు మాత్రమే ధాన్యం సరఫరా చేస్తామన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైస్‌మిల్లర్లు పూర్తిస్థాయిలో సహకరించాలన్నారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి ఈనెలాఖరులోపు సమస్యను పరిష్కరించాలన్నారు. జిల్లాకు ప్రత్యేకంగా గోనె సంచులు కేటాయించేలా చర్యలు తీసుకుంటామన్నారు. ప్రభుత్వం ద్వారా సేకరించిన సన్నబియ్యాన్ని పాఠశాలలు, హాస్టళ్లకు మధ్యాహ్న భోజన పథకానికి వినియోగిస్తామని తెలిపారు. దీపం పథకం సబ్సిడీ మహిళల ఖాతాల్లో జమ అయ్యేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమస్యలను త్వరితగతిన పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మంత్రి ఆనం మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో పర్యటన ద్వారానే మెరుగైన ఫలితాలు వస్తాయన్నారు. రైతుల ప్రయోజనాలే లక్ష్యంగా అధికారులందరూ పనిచేయాలని తెలిపారు. ఎప్పటికప్పుడు నూతనంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. రైతులు నష్టపోకుండా ప్రతిపైసా పెట్టుబడికి లాభం చేకూర్చాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ కార్తీక్, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ పట్టాభిరామిరెడ్డి, డీఎస్ఓ అంకయ్య, డీఎం అర్జున్‌రావు, వ్యవసాయ శాఖ జేడీ సత్యవాణి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు సుబ్రహ్మణ్యంరెడ్డి, రంగయ్యనాయుడు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు న్యాయం చేయండి

జిల్లాలో రైతులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకుడు మిడతల రమేష్ మంత్రి నాదేండ్ల మనోహర్‌కు వినతి పత్రం సమర్పించారు. రైతాంగం నష్టపోకుండా రైతులకు మద్దతు ధరకు మించి ధాన్యం కొనుగోలు చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

26 నుంచి మహాశివరాత్రి మహోత్సవాలు

నెల్లూరు(బృందావనం) : పొగతోటలోని ఆదిశంకర ధ్యానమందిరంలో చక్రాల వారి ట్రస్ట్ ఆధ్వర్యంలో ఈనెల 26 నుంచి మార్చి ఒకటో తేదీ వరకు శంకర జీవన గమన పర్వదిన మహోత్సవాలు విశేషంగా జరుగనున్నాయని ధ్యానమందిర కమిటీ అధ్యక్షుడు పారా గురువెంకటశ్రీధర్‌శర్మ, మేనేజింగ్ ట్రస్టీ చక్రాల ఆనందకుమార్ శనివారం తెలిపారు. మహాశివరాత్రిని పురస్కరించుకుని బుధవారం రాత్రి 10 గంటలకు లింగోద్భవ సమయ మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం జరుగనున్నాయన్నారు. ఇలా మార్చి 1వ తేదీ వరకు వివిధ పూజలు, హోమాలు, అలంకారాలు ఉంటాయన్నారు.

వారిపై చర్యలు తీసుకోరా..!

- విడవలూరు, మైపాడు బీసీ సంక్షేమ హాస్టళ్లలో చేతివాటం
- ఇద్దరు వార్డెన్లపై ఆరోపణలు
- విచారణ నివేదిక ఏమైందో..?



జిల్లా బీసీ వెల్ఫేర్ కార్యాలయం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట) : జిల్లాలోని రెండు బీసీ సంక్షేమ హాస్టళ్లలో ఇద్దరు వార్డెన్లు అవినీతికి పాల్పడ్డారని సంవత్సరం క్రితం ఆరోపణలు వచ్చాయి. దీనిపై ఉన్నతాధికారులతో విచారణ జరిపించారు. అయినా వారిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. ఉన్నతాధికారుల అండదండలు ఉండటంతో విచారణ నివేదికలను తొక్కి పెడుతున్నట్లు విశ్వసనీయ సమాచారం.

ఏం జరిగిందంటే..

విడవలూరు బీసీ బాలుర హాస్టల్లో మంజూరైన సీట్లు 74 అయితే 77 మందిని అటెండెన్స్‌లో చూపించారు. వాస్తవానికి అక్కడ సగం మంది కూడా లేరు. బిల్లులు మాత్రం 77 మందికి మంజూరయ్యాయి. ఫేజ్ రికగ్నేషన్ వల్ల ఈ వాస్తవాలు సంవత్సరం క్రితం వెలుగులోకి వచ్చాయి. అదే విధంగా మైపాడు బాలుర హాస్టల్లో అసలు విద్యార్థులు లేకపోయినా వారికి సంబంధించిన బిల్లులు, భవన రెంట్‌ను పెట్టి మంజూరు చేయించుకున్నారు. ఈ రెండు హాస్టళ్లలో వార్డెన్లు రూ.కోటికి పైగా ప్రభుత్వ సొమ్మును స్వాహా చేసినట్లు ఆరోపణలున్నాయి. ఈ తతంగం జరిగి ఏడాదైంది. విడవలూరు, మైపాడు వార్డెన్ల అవినీతి ఆరోపణలపై కలెక్టర్‌కు ఫిర్యాదులు వెళ్లాయి. దీంతో ఆయన మూడు నెలల క్రితం జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిణిని విచారణ చేయాలని ఆదేశించారు. ఆమె ఆ నివేదికను సమర్పించారు. కాగా శాఖాపరమైన విచారణ జరగ్గా దానికి సంబంధించిన నివేదికను కలెక్టర్‌కు పంపడంలో ఆలస్యమైంది. దీనికి పాత అధికారి లాగిన్‌లో అది ఉండటమే కారణమని చెబుతున్నారు. కానీ జాప్యానికి ఆ శాఖలోని కొందరు ఉన్నతాధికారులు, రాజకీయ నాయకులు ఒత్తిళ్ల కారణమని సమాచారం. కాగా ఆ వార్డెన్లు ఇంకా అదే హాస్టళ్లలో పనిచేస్తుండటం గమనార్హం.

కలెక్టర్‌కు ఫైల్ పంపాం

"సంబంధిత ఫైల్‌ను కలెక్టర్‌కు అందజేశాం. వారి ఆదేశాల రాగానే చర్యలు తీసుకుంటాం. గతంలో ఏం జరిగిందో నాకు తెలియదు. నేను నూతనంగా బాధ్యతలు స్వీకరించాను.

– వెంకటలక్ష్మి, జిల్లా బీసీ వెల్ఫేర్ అధికారిణి

24న ఇంటర్వ్యూలు

నెల్లూరు(బారకాసు) : నగరపాలక సంస్థ పరిధిలోని బీసీ, కాపు, ఈబీసీ కార్పొరేషన్‌ల సబ్సిడీ రుణాలకు సంబంధించి దరఖాస్తుదారులకు ఎన్ఎంసీ కమిషనర్ కార్యాలయ ప్రాంగణంలో సోమవారం ఇంటర్వ్యూలు జరుగనున్నాయని అదనపు కమిషనర్ వైఓ నందన్ తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఇంటర్వ్యూలు ఉంటాయన్నారు. అభ్యర్థులు తన అప్లికేషన్, ఆధార్ కార్డు, బ్యాంక్‌అకౌంట్, పాస్‌బుక్, రైస్‌కార్డు, కుల, ఆదాయ ధ్రువీకరణ పత్రాలతో హాజరు కావాలన్నారు.

ఉచిత శిక్షణ

నెల్లూరు(బారకాసు): మూన్ సోషల్ సర్వీస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వ పథకం ఈఈఎల్‌టీపీ ప్రాజెక్ట్ ద్వారా ఎస్సీ, ఎస్టీ, ఈడబ్ల్యూఎస్ నిరుద్యోగులు, విద్యార్థులకు వివిధ అంశాలపై ఉచిత శిక్షణ, ఉపాధి కల్పించనున్నట్లు ఫౌండేషన్ చైర్‌పర్సన్ ఎస్‌కే రబియా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్ఐఈఎల్ఐటీ (నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఎలక్ట్రానిక్స్ అండ్ ఇన్ఫర్మేషన్) సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. బీటెక్, డిగ్రీ, డిప్లొమా, ఇంటర్, పదో తరగతి చేసినవారు అర్హులున్నారు. రెండు నెలల పాటు శిక్షణ ఉంటుందని, ఆసక్తి కలిగిన వారు 91608 38485, 0861 – 7961281 ఫోన్ నంబర్లను సంప్రదించాలని తెలియజేశారు.

నేడూ విద్యుత్ బిల్లులను చెల్లించొచ్చు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : విద్యుత్ బిల్లుల చెల్లింపులను ఆదివారం కూడా చేయవచ్చని ఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని విద్యుత్ బిల్లుల వసూలు కేంద్రాలు యథావిధిగా పనిచేస్తాయని, వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఆన్‌లైన్‌లో కూడా చెల్లింపులు చేయవచ్చని వివరించారు.

మాలల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



మాట్లాడుతున్న విజయకుమార్



విజయకుమార్‌ను సత్కరిస్తున్న మాల మహానాడు నేతలు

నెల్లూరు (స్టోన్‌హౌస్‌పేట) : ఎస్సీ కార్పొరేషన్‌ను బలోపేతం చేసి మాలల ఆర్థికాభివృద్ధే లక్ష్యంగా కృషి చేస్తామని మాల సంక్షేమ సహకార ఆర్థిక సంస్థ లిమిటెడ్ చైర్మన్ విజయకుమార్ అన్నారు. ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎస్సీ కార్పొరేషన్‌కు మంచి రోజులు వచ్చాయన్నారు. యువతకు స్వయం ఉపాధి అవకాశాలు కల్పిస్తామన్నారు. త్వరలో ప్రత్యేక కార్యాచరణతో మాల యువత అన్ని రంగాల్లో రాణించేలా చర్యలు చేపడుతామన్నారు. తొలుత జిల్లా నాయకులు, అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. సంస్థ డైరెక్టర్లు రమాదేవి, యుగంధర్, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ నిర్మలాదేవి తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్టడీ సర్కిల్ నిర్మాణాన్ని పూర్తిచేయాలి

నగరంలో అంబేడ్కర్ స్టడీ సర్కిల్ నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేయాలని రాష్ట్ర మాల మహానాడు నిర్వాహక అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ కన్వీనర్ స్వర్ణా వెంకయ్య కోరారు. ఈ మేరకు విజయకుమార్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం సత్కరించారు. మాల మహానాడు జిల్లా అధ్యక్షుడు బల్లి వెంకయ్య, వాదనాల వెంకట్రమణ, ఉద్యోగుల సంఘాల అధ్యక్షుడు విజయకుమార్, కొప్పోలు రఘు, బల్లి శరత్‌కుమార్, తులసీ, మదన్, రమేష్ ఉన్నారు.

లో ఓల్టేజీ సమస్య పరిష్కారానికి వినతి



సబ్ ఇంజినీర్‌కు వినతి పత్రం ఇస్తున్న స్థానికులు

నెల్లూరు(వీఆర్సీసెంటర్) : గత పదేళ్లుగా సరైన విద్యుత్ లైన్లు లేక లో–ఓల్టేజీ సమస్యతో అల్లాడుతున్నామని, వెంటనే పరిష్కరించాలని నగరంలోని 54వ డివిజన్ జనార్దనరెడ్డి కాలనీ ప్రజలు శనివారం విద్యుత్ శాఖ అధికారులను కలిసి విన్నవించుకున్నారు. నగరంలోని వెంకటేశ్వరపురం విద్యుత్ సెక్షన్ కార్యాలయానికి వారు వచ్చి సబ్ ఇంజినీర్ చంద్రఆచారిని కలిసి వినతి పత్రం అందజేశారు. కాలనీలో నెలకొన్న సమస్యలను వివరించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై ఆయన స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామన్నారు.